ప్రభ:- వామ భాగమగు నీ శరీరాంశమున శివునికి స్వామ్యము లేదు. దక్షిణ భాగమగు శివశరీరాంశమున నీకు స్వామ్యము లేదు. ఇట్లు మీయుభయుల శరీర భాగములును విభక్తములైయున్నను, మీరొకరికొకరు ప్రాణములై యున్నారు. అని భావము. ఇచ్చటఁగలది – అన్యోన్యాలంకారము.

మూ॥ అవిభక్తం భవాని! స్వం భవస్య తవచోభయోః।
సకృత్ సకరుణం చేతః సఙ్కల్పయతు నశ్శివమ్॥ 24

భవానీ! భవునకును నీకును – ఉభయులకును విభక్తము కాని (ఏకమైయున్న) సకరుణమగు మనస్సు మాయొక్క కల్యాణము నొక్కమారు సంకల్పించుఁగాత!

ప్రభ:- మీ శరీరము – విభక్తము. ప్రాణములు నీవు- శివునకు, శివుఁడు- నీకు, కాని మనస్సొక్కటే, అమనస్సంకల్పము – అమోఘ- సద్యః ఫలదాయకమగుట చేత- ఒక్కమారే కోరఁబడినది.

మూ॥ భవస్య భాగముత్సృజ్యభవానీ భాగమాత్మనః।
భజత్వనుష్టు భామాసాం సృష్టానాం నారసింహినా॥ 25

భవానియగు దేవి – నరసింహ పుత్రుఁడును, కవియునగు గణపతి చేత నిర్మింపఁబడి- సమర్పింపఁబడిన అనుష్టుప్ కృతులలో భవుని భాగమును భవునకు విడిచి, (ఆత్మ) తన భాగమును తాను స్వీకరించుఁగాత!

ప్రభ:- భవుని భాగమునఁగా; శివవర్ణనపరమగు పద్యభాగము

ఇది - స్వ్యాఖ్యమగు ఇరువది యొకటవ స్తబకము.

****





# ఉమాసహస్రము

## (ఆరవ శతకము ద్వితీయస్తబకము)

## ద్వావింశ స్తబకము

**అవ:-** ఇరువది రెండవదియగు నీ స్తబకమున కైలాసనాధుని ప్రభావము వర్ణింపఁబడునపుడు తత్కాంతా సౌభాగ్యమును, వర్ణింపఁబడుచున్నది. మఱియు శివకుటుంబకము కీర్తింపఁబడును. స్తబక ప్రారంభమున వెనుకటివలెనే హసితము స్తుతింపఁబడుచున్నది.

మూ॥ అఖిలస్య వికాసకారణమ్
వ్యసని జ్ఞానిజనావనేషునః।
వితనోతు విశేషతః శివం
శివరాజీవదృశో దరస్మితమ్॥ 1

సర్వమునకును ఉన్మీలన హేతుభూతమును, జ్ఞానులగు మనుష్యులను పాలించుటయందు వ్యసనము గలదియు, అగు శివసుందరి యొక్క మందస్మితము- మాకుమంగళము నిచ్చుఁగాత!

ప్రభ:- వ్యసనమను పదము కామమువలనఁ గలిగిన దోషమున వర్తించును. అయినను జ్ఞానులయందుఁగల వాత్సల్యాతిశయమును ప్రదర్శించుట కిచట ప్రయోగింపఁబడినది. దేవీ మందస్మితము. తన్ముఖము నందు వికసించును. దాని చేత నీ విశ్వము మేల్కొనును. ఆ మందస్మితము – ఉజ్జ్వలము. కావున ప్రకాశపాలనము దానికి స్వాభావికమగును. కావుననే అబోధమున కంతకును ప్రబోధమును కలిగించునదియు, ప్రబోధము నొందిన జనము యొక్క బోధమును రక్షించునదియు నగును. కావున నిట్లు అప్రాప్తలాభరూపమగు యోగమును, ప్రాప్త

రక్షణ రూపమగు క్షేమమును, గలిగించుచు, ఆ మందస్మితము మాకు కల్యాణము నొసఁగుఁగాతమని ప్రార్థింపఁబడుచున్నది.

మూ॥ వికలే సకలే సురవ్రజే। వ్రజతి శ్యామలి మానమచ్యుతే।
జగత్సదయోహలాహలంచుళు కీకృత్యభయంనునోదయః॥2

నిర్జరగణమంతయు విషాదము నొందుచుండ, అచ్యుతుఁడు (విష్ణువు) శ్యామలిమ (నల్లఁదనము) నొందుచుండ, పరమకారుణికుఁడైన యేభగవానుఁడు హలాహలమును (మహా విషమును) (ఆపోశనముగొని) పుడిసిలిగొని లోకము యొక్క భయమును తొలఁగించునో,

ప్రభ:- అమృత మథన సమయమున - మొదట వాసుకియను సర్పరజ్జువు యొక్క శిరస్సు నుండి బయలు వెడలిన మహా విషము యొక్క ప్రతాపము వలన దేవగణము - విషణ్ణము కాఁగా, చ్యుతిలేని విష్ణువు కూడ - నిష్ప్రభుఁడు కాఁగా, సదయుఁడు హరుఁడు - దానినంతను గూడ, అనాయాసముగాఁ త్రాగి జగత్త్రయము నడఁచెనని భావము. ఈ శ్లోకము నుండి 10వ శ్లోకము వఱకును గల 8 శ్లోకములును 10వ శ్లోకమునందలి ''తేన, ధవేన'' అటువంటి భర్తతో'' అనుదానితో నవ్వయించునని తెలియునది.

మూ॥ నిగమై స్తురగీ భువారథీ
విధినాసారథిమాన్ విభేదయః।
కనకాద్రివరేణ కార్ముకీ
కమాలాక్షేణశరీ పురత్రయమ్॥ 3

వేదములు - గుఱ్ఱములుగాను, భూమి - రథముగాను, బ్రహ్మదేవుఁడు- సారథిగాను, మేరు పర్వతము - విల్లుగాను, విష్ణువు- బాణముగాను, గలవాఁడై



యే భగవానుఁడు (త్రిపుర యుద్ధమున) పురత్రయమును (త్రిపురమును) భేదించెనో.

మూ॥ అజితస్య చ గాఢమత్సరైః
కమలాకాన్త పురస్సరైస్సురైః
పదజాయుధ ధారయారయాద్
వధమాధత్త జలన్ధరస్యయః॥ 4

దృఢమగు మత్సరము (ద్వేషము) గల విష్ణు ప్రముఖులగు దేవతల చేతఁగూడ జయింపబడని జలంధరుఁడను రాక్షసుని, ఏభగవానుఁడు పదనఖమేయగు (తనకాలిగోరగు) ఆయుధము యొక్క నిశితాగ్రము చేత వధించెనో,

ప్రభ:- లింగపురాణమున జలంధరాసురవధమిట్లు చెప్పఁబడినది. జలమండలమున జన్మించుట వలన జలంధరుఁడను రాక్షసుఁడు ప్రసిద్ధుఁడగుచున్నాఁడు. వాఁడు అంతక సదృశుఁడు. తపోలబ్ధ విక్రముఁడు... అతని వాక్యమును విని శూలి - లీల చేత - ఆ మహాబలమున భయంకరమగు రథాంగమును తన పాదాంగుష్ఠముచే విసరెను.... (దాని చేత) మహాబల శాలియగు నాదైత్యుఁడు రెండవ యంజనాద్రివలె పడియెను. (లింగపురాణము 97వ అధ్యాయము చూచునది)

మూ॥ కమలాసనకఞ్జలోచనౌ । ఛలలిఙ్గస్య శివో క్షివీక్షితుమ్।
బత! హంసవరాహభూమికౌ। యతమానావపియస్య నప్రభూ॥ 5

**కమలాసనుఁడగు బ్రహ్మయు, కమలాక్షుఁడగు విష్ణువును, హంస వేషమును, వరాహవేషమును ధరించి, ప్రయత్నము నొనర్చినను గూడ - మాయా (ఛల) లింగాకృతియగు నేపరమేశ్వరుని యొక్క శీర్షమును, పాదములను, గుర్తించుటకు పాపము సమర్థులు కాఁజాలకుండిరో.**

**ప్రభ:-** ఇందలి కథాంశము నిట్లెఱుఁగునది. బ్రహ్మ - విష్ణువులకు తమలో నెవ్వఁడధికుఁడను విషయమున వివాదము కలిగెను. అప్పుడచట నాద్యంతరహితమగు మాయా లింగస్వరూపమున శివుఁడావిర్భవించెను. ఆలింగము యొక్క శీర్షమునుగాని, పాదములను గాని, వీక్షించినవాఁడు తమలో నధికుఁడని వారు నిర్ణయించుకొనిరి. బ్రహ్మ శివుని శీర్షము నవలోకించుటకు హంసయై యాకాశమున కెగిరెను. విష్ణువు వరాహమై పాదములను సమీక్షించుటకు భూమియందుఁ జొచ్చెను. కాని యెంత వెదకిననుగూడ వానినిఁజూడఁ జాలరయిరి. ఆద్యంతవర్జితుఁడగువాని యాదిని, అంతమును, తెలిసికొనుట కెవ్వఁడు శక్తుఁడగునను నర్థమిందు గమ్యమగుచున్నది. (''యతవమానౌచ నయస్యశక్నుతః'' అను నింకొకపాఠము మూలమునఁ గలదని తెలియునది.)

మూ॥ నయనం నిటలాన్తరస్థితం విఘటయ్యేషది వాన్వితోరుషా।
భువన త్రయనిర్జయోన్నతం మదనంగాఢమదం దదాహయః॥ 6

ఏ భగవానుఁడు - లలాట మధ్యమునందున్న, అగ్ని నేత్రమును రోషము చేత నించుక తెఱచి - త్రిలోకజయోన్నతుఁడగుట వలన మిక్కిలి గర్వించిన మన్మథుని దహించెనో.

మూ॥ సకలేధవలః కలేబరే హరినీలోపలమఞ్జులః క్వచిత్
అమృతాంశురి వాదధాతియః పరమామక్షిముదం ప్రపశ్యతామ్॥ 7

ఏ భగవానుఁడు - సకల కళేబరమునందును ధవళ వర్ణము గలిగి, ఒక్కచోట ( కంఠమునందు) ఇంద్రనీలమణివలె మంజులమగు రూపము గలిగి, మృగాంకుఁడగు సితాంశుని (చంద్రుని) వలె అవలోకించుచున్న జనులకుత్కృష్టమగు నయానానందమును ధరించునో,

**ప్రభ:-**సర్వాంగ శుభ్రుఁడై కంఠమున ఇంద్రనీల శ్యామలుఁడగు శివుఁడు-మచ్చగల చంద్రుని వలె నున్నాఁడని చెప్పఁబడినది. ఒకచో నీలిమ గలిగియుండుట-



సర్వాంగమును తెల్లగానుండుట - నేత్రానందమును గలిగించుట, అనునవి - శివ - చంద్రులయందుఁగల సమానధర్మములు. కావున నిందు నుపలంకారము స్పష్టమగుచున్నది.

మూ॥ అవతంస తుషారదీధితి । ద్యుతిభిర్యస్య యశోభరై రపి ।
సమమచ్ఛతరీకృతో దిశామవ కాశస్సుతరాం ప్రకాశతే॥ 8

ఏ భగవానుని యొక్క శిరోభూషణహిమాంశు (చంద్ర) కాంతుల చేతను, యశోఽతిశయముల చేతనుగూడ, సమముగా దిగవకాశము - నిర్మలీకృతమై ప్రకాశించుచున్నదో,

**ప్రభ:-** దిగవకాశము = దిక్కులయందలి యవకాశము; అనగాఁ సర్వదిశలయందును గల ఆకాశము. శివుని యొక్క శిరస్సునందలి చంద్రద్యుతుల వలె శివుని కీర్త్యతిశయములు కూడ సర్వదిశలను నిండించుచున్నవని భావము. ఇందుహర శిరశ్చంద్ర కాంతులు - యశోభర సహితములగుట చమత్కృతిని గలిగించుచున్నది. కావున నిది సహోక్త్యలంకార మగుచున్నది.

మూ॥ గగనానిల జీవనానిలక్షితి సోమారుణ సోమయాజిభిః
మహతోబత! యస్యమూర్తి భిర్భువనం క్రాన్త మిదం సమస్త తః 9

**సుహృద్రూపుఁడగు ఏ భగవానునికి ఆకాశము - వాయువు, అగ్ని, జలము, భూమి, చంద్రుడు, సూర్యుడు, సోమయాజి అను అష్టమూర్తులచేత - అంతటనుగూడ నాశ్చర్యముగా నీ జగత్తు వ్యాపింపబడియున్నదో.**

**ప్రభ:-** పరమేశ్వరుఁడు - అష్టమూర్తి యనునంశము శ్రుతి - స్మృతి ప్రసిద్ధము.

మూ॥ సహ తేన ధవేన రాజతే, వసుధాధారిణికాఽపి రాజతే
వనితా భవతాపనాశినీ చరణ ప్రేష్యనివేదితాశినీ॥ 10

అట్టి భర్తతోఁగూడ వెండికొండయగు కైలాసమున సంసార తాపము నశింపఁ జేయునదియు, పాదకింకరుఁడగు భక్తునిచే నివేదింపఁబడిన వస్తువు ననుభవించునదియు, నగు ఒకానొక (అనిర్వాచ్యయగు) స్త్రీయగు పరమేశ్వరి - సర్వోత్కృష్టయై యున్నది.

**ప్రభ**:- ఉమాదేవి సర్వేశ్వరసనాథయై కైలాసమున నివసించుచు వెలయుచున్నదని భావము. ఇందలి రెండవశ్లోకము నుండియుఁ గల శ్లోకములన్నియు నీశ్లోకార్థముతో నన్వయించునని గ్రహించునది.

మూ॥ వని తాపురుషౌ పురాతనౌ విమలేవ్యోమని దేవదమ్పతీ।
భువనత్రి తయస్యతౌ విభూ రజతా ద్రావిహసిద్ధదమ్పతీ॥ 11

పురాతనులగు స్త్రీ పురుషులు చిన్మయులై యాకాశమున దేవ దంపతులై యున్నారు. ముల్లోకములకును ఈశ్వరులగు వారు - ఇచ్చట (భూమియందు) కైలాసమున సిద్ధ పురుషులగు దంపతులగుచున్నారు.

**ప్రభ**:- ద్యులోకమున తేజోమయస్వరూపమున దేవ దంపతులైయున్న యాశ్వరులు - పార్వతీ శివులై యిచట కైలాసమున నివసించు సిద్ధ దంపతులగు చున్నారని భావము.

మూ॥ గజచర్మధరః కపాలభృత్ గృహనాథో గృహిణీతుకాలికా
రుధి రావిలముణ్డమాలినీ కథితౌ తౌబత! పణ్డితైః శివౌ॥ 12

గృహపతియగు నీశ్వరుఁడు- గజ చర్మమును ధరించువాఁడును కపాలమును భరించువాఁడును, అగుచున్నాఁడు. గృహిణియగు కాలిక - రక్తము చేత కలుషితమైన శీర్షములయొక్క మాలికలు గలిగి యున్నది. ఇట్లుండినను వారిని నిత్యమంగళులని పండితులు జెప్పుదురు.



**ప్రభ**:- ఆ దంపతు లిద్ద ఱునుగాడ - ఘోర దర్శనులును, అశివస్వరూపులును అగుచున్నను విజ్ఞులు వారిని శివస్వరూపులని చెప్పుదురని భావము. ఇది విరోధమైయున్నది. వేషము చేత అశివరూపులైనను స్వరూపము చేత నిత్యమంగళస్వరూపులును, పండితవేద్యులును, అగుదురు. కావున - మీఁది విరోధము - ఆభాసమే ( ఉన్నట్లు తోఁచునదియే) యగును. కావున నిది విరోధాభాసాలంకార మగుచున్నది.

మూ॥ సకిమిన్దుకలాశిరోమణిః కిమతాశ్లీలకపాలభూషణః
కిముమే భవతీకపాలినీ కిమువిభ్రాజితరత్న మాలినీ॥ 13

ఆ శివుఁడు- చంద్ర కళాశిరోమణియా? లేక అశ్లీలక పాలభూషణుఁడా? ఉమాదేవీ! నీవు - విభ్రాజితరత్న మాలినివా? లేక కపాల మాలాధారిణివా?

**ప్రభ**:- మీరిద్దరును అనురూపములగు సుందర వేషములు గలవారలా? లేక అనురూపములగు ఘోర వేషములు గలవారలా? అని భావము.

మూ॥ రమసేఽమ్బ! కపాలమాలినీ। క్వచిదీ శేన కపాలమాలినా।
అతుల ప్రభ నిష్క మాలినా। క్వచిదత్యుత్తమరత్నమాలినీ॥ 14

అమ్మా! నీవు - ఒకవేళ - ఒక దేశమున కపాలమాలినివై కపాల మాలియగు నీశునితోఁగూడి క్రీడించుచుందువు. ఇంకొక వేళ, ఇంకొకదేశమున - ఉత్తమరత్న మాలినివై అనుపమ ప్రభాయుత సువర్ణ మాలియగు శివునితోఁగూడి క్రీడించుచుందువు.

మూ॥ యువయోర్మరుతస్తనూభువో, బలవన్తో భువనప్రకమ్పనాః
శశిదీధితి హారియద్యశో నిగమే పావనమమ్బ! గీయ తే॥ 15

మీతనూభువులగు మరుత్తులు (మరున్నామకులును వాయువులును అగు దేవతలు) బలవంతులును, లోకములను ప్రచలింప జేయువారును, అగుచున్నారు.

చంద్రకాంతివలె రమణీయమగు వారి కీర్తిని మంత్రద్రష్టలు వేదము గానమొనర్చియున్నారు.

**ప్రభ:**- పార్వతీశ్వరులు, మరుత్తులకు తల్లిదండ్రులని చెప్పుట వలన పారమైశ్వర్యార్థకమగు ఇంద్రత్వము వారికే చెప్పఁబడినదగుచున్నది. తత్పుత్రులగు గణేశ కుమారులే మరుత్తులని చెప్పఁబడినట్లగుచున్నది. ఈ యంశము ముందు చెప్పఁబడును.

మూ॥ గురుముత్తమ మభ్రచారిణా। మసమబ్రహ్మనిధాన నాయకమ్
తవ దేవి! శివే! తనూభువాం। మరుతామన్యతమం ప్రచక్షతే 16

దేవీ! శివా! ద్యులోకచారులలో శ్రేష్ఠుఁడగు బృహస్పతిని అద్వితీయ - వేదమంత్ర నిధాన నాయకుఁడగు బ్రహ్మణస్పతియనియు, నీతనూభవులగు మరుత్తులలో నొకఁడనియు, వేదవేత్తలు చెప్పుచున్నారు.

**ప్రభ:**- బృహస్పతియు - బ్రహ్మణస్పతియు 'నొక్కఁడే' యనియు, అతఁడు వేదమంత్రముల కధిష్ఠాన దేవతయనియు, వేద విదులు చెప్పుదురు. ఆ బ్రహ్మణస్పతి. పురాణముల యందు నామ భేదమును, రూప భేదమును గూడ, గలవాఁడుగా, దెలుపఁబడి యున్నాఁడు.

**అవ:**- పురాణములందు బ్రహ్మణస్పతికిఁగల నామరూప విశేషమును దెలుపుచున్నాఁడు.

మూ॥ ద్విరదంవదనే మహామదం, సిరదన్త చ్ఛ విధౌతది క్తటమ్।
ఇతరత్రముఖాన్న రాకృతిం విదుర స్యైవవివర్తమద్భుతమ్॥ 17

మహామదము (అధికమగు మదజలం) గలవాఁడును, తెల్లనిదంతము యొక్క కాంతుల చేత శోధింపఁబడిన దిక్తటములు గలవాఁడును, ముఖమునందు-



రెండు దంతములు గల గజ స్వరూపమును, ఆ ముఖము కంటె నితరమగు శరీరమునందు నర స్వరూపమును గల విఘ్నేశ్వరుని - వెనుక చెప్పఁబడిన మరుత్తులలో నొకఁడగు బ్రాహ్మణ స్పతి యొక్క విచిత్రమగు వివర్తమని విజ్ఞులు చెప్పుచున్నారు.

**ప్రభ:**- బ్రహ్మణస్పతియే రూప భేదము నొంది విఘ్నేశ్వరుఁ డయ్యెననియు గజముఖము - నరరూపము - గలదగుట చేత యీ వివర్తము (రూప భేదము నొందినయాకారము) అద్భుత మగుచున్నదనియు, గ్రహించునది. బ్రహ్మణస్పతి - గణపతుల కభేదమును ప్రతిపాదించుచున్నది యగు నొక మంత్రవర్ణము గలదు. "గణానాంత్వా గణపతిం హవామహే కవింకవీనా ముపమ శ్రవస్తమమ్. జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనఃశృణ్వన్నూతిభిః సీదసాదనమ్॥ ఇతి.

**అవ:**- ఇట్లు జ్యేష్ఠుఁడగు గణపతిని ప్రస్తావించి, కనిష్ఠుఁడగు కుమారుని ప్రస్తావించుచున్నాఁడు.

మూ॥ అఖిలామరనిర్జయోన్నతః ప్రథనేతారకదానవోబలీ
హృతవీర్యమదోబభూవయద్ - ఘన శక్త్యాయుధ తేజసాఞ్జసా॥ 18

దేవతలనందఱను నిర్జించుట చేత నున్నతమయిన కీర్తిగలవాఁడును, బలవంతుఁడును, అగు తారకాసురుఁడు ఏ దేవుని యొక్క సత్త్వభరితమగు శక్తియను నాయుధము యొక్క తేజము (ప్రతాపము) చేత - శీఘ్రముగా నపహరింపఁబడిన వీర్యమదము (వీర్యమువలని దర్పము) గలవాఁడయ్యెనో, ("అగుహుఁడు" అను **23**వ శ్లోకార్థముతో నన్వయము)

**ప్రభ:**- ఏ భగవానుఁడు మహాబలిష్ఠమగు శక్త్యాయుధము చేత- తారకాసురుని జయించెనో, " ఆ గుహుఁడు.... నీకు ప్రేమాస్పదమగు కుమారకుఁడు" అని **23** శ్లోకార్థముతో నన్వయించునది.

మూ॥ అమలే హృదినిర్మలాశనాచ్ఛిథిలే గ్రన్థిచయే నరాయయః
పరిపక్వధియే ప్రదర్శయేత్ తమసః పారమపార వైభవః॥ 19

పరిశుద్ధమగు నాహారము వలన హృదయము నిర్మలము కాఁగా, అవిద్యా గ్రంథిసమూహము విడివడఁగా, పరిపక్వమయిన బుద్ధిగల మానవునకు - నిరవధికమగు (అంతము లేని) నైశ్వర్యము గలవాఁడగు- ఏ భగవానుఁడు (సనత్కుమారుఁడు) తమస్సు యొక్క పారమును (చీకటి యొక్క అంతమును) ప్రదర్శింపఁజేసెనో.

**ప్రభ:- మనుష్యుడు నిర్మలమగు నాహారమును గొనుట వలన హృదయము నిర్మలమగుననియు, అవిద్యా గ్రంథులు విడిపోవుననియు - హృదయ కషాయ విముక్తుఁడగు నారదునికి బోధించిన సనత్కుమారుని స్కందుఁడని చెప్పదురు.'' అని ఛాందోగ్యమునందుఁ జెప్పఁబడినది.**

మూ॥ ద్రవిడేషు శిశుత్వమేత్యయో గిరిశశ్లోక విశేషగాయినీమ్
అమృత ద్రవసారహారిణీం నిగమాభాం నిబబన్ధసం స్తుతిమ్ ॥ 20

జ్ఞాన సంబంధ మూర్తియను పేరుగల ఏ భగవానుఁడు - ద్రవిడ దేశమునందుదయించి, శైశవమునందే శివయశో విశేషమును గానము చేయునదియు, అమృతరససారాంశమును గూడ నతిశయించునదియు, వేద తుల్యమగునదియు, అగు సంస్తుతిని నిబంధించెనో.

ప్రభ:- ద్రవిడ శిశువగు జ్ఞాన సంబంధమూర్తి స్కందావతారుఁడని చెప్పుదురు. సౌందర్యలహరియందు ''తవస్తన్యంమన్యే'' అను శ్లోకము నందుల్లేఖింపఁబడిన ద్రవిడ శిశువు సంబంధమూర్తియగునని తోఁచెడిని. ఈ జ్ఞాన సంబంధమూర్తి దేవారను పేరుగల ద్రవిడ వేద ప్రబంధమును నిబంధించెను. అప్రబంధమే మీఁది శ్లోకమున ఉల్లేకింపఁబడినది.

మూ॥ భువిబట్ట కుమారి లాఖ్యయా, భవమే త్యాధ్వర రక్షణాయయః
వరజైమిని భాషి తాశయం బహులాభిః ఖలుయుక్తిభిర్దధౌ॥ 21



ఏ భగవానుఁడగు స్కందుఁడు- కుమారిల భట్టనామమున భూతలమునందవతరించి - వైదిక ధర్మమగు క్రతువును రక్షించుటకు మునిశ్రేష్ఠుడగు జైమిని చెప్పిన (ధర్మమీమాంసాసూత్ర) వచనముల యభిప్రాయమును, అనేకములగు తార్కికయుక్తుల చేత పోషించెనో.

ప్రభ:- (ఆంధ్రుఁడుగా సుప్రసిద్ధుఁడయిన) కుమారిల భట్టు జైమిని ప్రణీత ధర్మమీమాంసను స్పష్టీకరించునవియగు తంత్ర వార్తిక - శ్లోక వార్తిక - టుప్ టీకలను గ్రంథములను విరచించెను. అతఁడు స్కందాంశజాతుఁడను నైతిహ్యము గలదు.

మూ॥ అధునావిధునోతి యస్తమో విబుధ ప్రేక్షిత మార్గరోధకమ్ ।
రమణాఖ్య మహర్షి వేష భృచ్ఛ్రిత శోణాచలచారుకన్దరః॥ 22

ఏ భగవానుఁడు – (సంబంధ – కుమారిల వేషములతో పూర్వమవతరించి కార్యభారమును వహించుటయే కాక, ఇప్పుడుగూడ అరుణాచలమునందలి సుందరకందరమును (గుహను) ఆశ్రయించి – 'రమణ మహర్షి' అను నామముగల వేషమును (బాహ్య రూపమును) వహించి- విజ్ఞులచేఁ జూడఁబడిన మార్గము నడ్డగించుచున్న యంధకారమును (అవిద్యను) పటాపంచలు చేయుచున్నాఁడో,

**ప్రభ:- ఈ శ్లోకము చేత ఈ మహాకవి తనయాచార్యుఁడగు రమణ మహర్షిని స్కందునిగాఁ దెలియుచున్నాఁడని గ్రహింపవలసి యున్నది.**

మూ॥ సగుహోఽతి మహోమహామహా త్రిదశానాం ప్రథితశ్చమూపతిః
జగతామధిరాజ్ఞి! కోఽపితే సుతరాం ప్రీతిపదం కుమారకః॥ 23

జగచ్చక్రవర్తినీ! ఆగుహుఁడు – అమితమగు నుత్సవము గల వాఁడును, గొప్ప తేజస్సు గలవాఁడును, ప్రఖ్యాతుఁడును, దేవసేనా పతియును, అనిర్వచనీయుఁడును, నీకు- అత్యంత ప్రేమాస్పదుఁడును అగు కుమారకుఁడు (బాలుడు) అగుచున్నాఁడు.

ప్రభ:- గణపతి – శివాంకమునందుండు వాఁడని వెనుక చెప్పినపుడు శక్తి ధరుఁడగు స్కందుఁడు శక్తి ప్రియుఁడని చెప్పఁబడినది. చిన్నవాడు – తల్లికి వాత్సల్య పాత్రుఁడు గదా?

మూ॥ జయతి త్రిపురారి భామినీ, గణపత్యాదిమరుత్ ప్రసూరుమా।
తమసూత సురారి ధూతయే। త్రిదశానామపియా చమూపతిమ్॥ 24

అసుర ధ్వంసము కొఱకు దేవతలకు గూడ సేనా పతియగు కుమారుని, గణపతి మొదలుగాఁగల మరుత్తులను, కన్నతల్లియగు త్రిపురారిభామిని (శివకాంత) యుమ ప్రకర్షచే వెలయుఁగాత!

ప్రభ:- ''గురుముత్తమమ్'' అను శ్లోకమున బ్రహ్మణస్పతి– మరుత్తని చెప్పఁబడినది. తరువాతి శ్లోకమున – ఆ బ్రహ్మణస్పతియే గణపతియనియు, జ్యేష్ఠుఁడనియు చెప్పఁబడినది. సురారులగు రాక్షసులను సంహరించుటకు జగన్మాతయగు పార్వతి దేవసే నానియగు స్కందుని గనియెనని భావము.

మూ॥ స్వకుటుంబకథాభిధాయినీ ర్గణనాథస్య వియోగినీరిమాః
అవధారయతు ప్రసన్నయా నగనాథప్రియనన్దినీధియా॥ 25

తనకుటుంబము యొక్క కథలను దెలుపునవియగు గణపతికవి యొక్క వియోగినీవృత్త నిబద్ధములగు ఈ స్తుతులను – పర్వతరాజప్రియ పుత్రియగు నుమాదేవి – ప్రసన్నమగు బుద్ధిచేత నిశ్చయించుఁగాత!

ప్రభ:- నాచే నుల్లేఖింపఁబడిన స్వకుటుంబకథలు – సమీచీనములో, కావో, తద్విజ్ఞయగు జగదంబయే పర్యాలోచించుఁగాతమని భావము.

ఇది – సవ్యాఖ్యమగు – ద్వావింశ స్తబకము

* * * *



ఓం నమో భగవతే శ్రీరమణాయ

# ఉమా సహస్రము

## (ఆరవ శతకము – తృతీయస్తబకము)

## త్రయోవింశ స్తబకము

**అవ:- ఇరువది మూడవదియు, ఇరువది నాలుగవదియు నగు స్తబకములు ప్రకీర్ణకములు - అందీ యిరువది మూడవ స్తబకము - గాయత్రీగర్భితము. ఇందు- 'తత్' అనునది మొదలుకొని, 'యాత్' అనునది తుదిగాఁ గల గాయత్రీ మంత్రమునందలి యిరువది నాల్గు వర్ణములు క్రమముగా, క్రింది శ్లోకములయందలి తృతీయ పాదములయందలి చతుర్థవర్ణములై కాన్పించును.**

మూ॥ కిరదివామృతం కిరణమాలయా
జయతి తత్ స్మితం, శివవధూస్మితమ్॥ 1

కిరణమాలచేత – అమృతమును వర్షించునది వలెనున్న శుభమగు – ఆశివ వధూస్మితము – జయించుచున్నది.

ప్రభ:- సితస్మితప్రసారను – అమృతమును వర్షించుచున్నట్లు సంభావింప ఁబడినది. కావున నిందలి యలంకారము– ఉత్ప్రేక్ష. దీనిచేత శివవధూ ముఖమునకు చంద్రునితోడి యుపమానము గమ్యమగుచున్నది. గాయత్రీ మంత్రము నందలి మొదటి యక్షరము 'తత్' అనునది – ఇందలి మూడవ పాదము నందలి నాలుగవ యక్షరముగా గ్రహింపఁబడినదని తెలియునది.

మూ॥ తవ పదంపరే మమ గుహాన్తరే
స్ఫురతుసర్వదా, వికసితంముదా॥ 2